నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కొత్త బాదుడు..!

- 1 నుంచి రిజిస్ట్రేషన్ విలువ పెంపు
- 15 నుంచి 45 శాతం వరకూ పెంచేందుకు చర్యలు

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు, పెరిగిన విద్యుత్ చార్జీలతో సతమతమవుతున్న ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మరో బాదుడుకు రంగం సిద్ధం చేసింది. భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచేందుకు చర్యలు చేపట్టింది. నూతన సంవత్సరం ఆరంభం నుంచే పెంచిన భూముల విలువను అమలు చేయనుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేయడంతో వారు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల విలువలు అమాంతంగా పెంచేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల విలువలు అమాంతంగా పెంచేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే భూముల విలువ ఎక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 15 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని, భూముల విలువ తక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 45 శాతం వరకు పెంచాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ మేరకు పెంపుపై రిజిస్ట్రేషన్, రెవెన్యూ అఉధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఎక్కడ ఏ విధంగా భూముల విలువను పెంచాలనే దానిపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. కొత్త నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లోని భూముల విలువను అమాంతంగా 45 శాతం వరకు పెంచుతారు. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల వారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలు విలువనూ పెంచనుంది. పట్టణాల్లోని అపార్టుమెంట్లలోని ప్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువ రూ.900 నుంచి రూ.1,400 వరకు పెరగనుంది. ప్రాంతాల వారీగా స్థలం విలువలను బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెంచిన మార్కెట్ విలువలు నూతన సంవత్సరం కానుకగా ప్రజలపై భారం వేయనున్నాయి. పెంచిన విలువలను ఈనెల 20వ తేదీ లోపు సబ్ రిజిస్ట్రార్లు డేటా ఎంట్రీ చేయాలి. వాటిపై 24వ తేదీ వరకు ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలి. వచ్చిన అభ్యంతరాలను 26వ తేదీలోపు పరిష్కరించాలి. 27లోపు నూతన భూముల విలువలను మార్పు చేసే ప్రక్రియ మొత్తంగా ముగియాలి. 2025 జనవరి 1 నుంచి పెంచిన విలువల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం ఆదాయం కోసం మార్కెట్ విలువను పెంచడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కర్నూలు నగరంలోని విద్యా నగర్, మేడం కంపౌండ్ ప్రాంతాల్లో గజం భూమి విలువ దాదాపు రూ.45 వేల వరకూ ఉంది. ప్రస్తుతం అక్కడ 15 శాతం పెంచితే రూ.6,750 వరకూ రిజిస్ట్రేషన్ విలువ పెరుగుతుంది. భూమి విలువ గజానికి రూ.52,750కు చేరుతుంది. నంద్యాల పట్టణంలోని కల్పనా సెంటర్, షరాఫ్ బజార్, శ్రీనివాస నగర్ ప్రాంతాలలో ప్రస్తుతం గజం విలువ రూ.25 వేలు ఉంది. 10 నుంచి 20 శాతం పెంచితే గజానికి రూ.5వేలు పెరగనుంది. గజం భూమి విలువ రూ.30వేలకు చేరనుంది. ఇలా అన్ని ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంచనున్నారు. క్రయ విక్రయాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో భూమి, స్థలాల విలువలు తప్పనిసరిగా పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

నోయిడాలో రైతులందరినీ

విడుదల చేయాలి

- రైతు సంఘాల సమన్వయ కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతు నాయకుడు జగజీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేతను ఆపాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లస్కర్ జైలు నుండి నోయిడా గ్రేటర్ నోయిడా రైతులందరిని విడుదల చేయాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా కలెక్టరేట్ ముందు సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శిదంబోల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పోతులశేఖర్, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, ఎఐకెఎస్ నాయకులు రాజన్న, వెంకటస్వామి తదితరులు మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్య పాలన సూత్రాలకు కట్టుబడి ఉండకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే రైతు సంఘాల నేతలతో చర్చలు జరిపి సంఘం నాయకుడు సింగ్ దీక్షను విరమింపజేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా నరేంద్ర మోడీ ప్రభుత్వం పెడచెవిన పెడుతుందన్నారు. ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత, బాష్ప వాయు ప్రయోగాలు ఆపాలని డిమాండ్ చేశారు. గౌతమబుద్ధ నగర్ లోని లస్కర్ జైల్లో ఉన్న రైతులందరినీ తక్షణమే విడుదల చేయాలని తప్పుడు అభియోగాలను ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిన వ్యవసాయ మార్కెట్ జాతీయ విధానాన్ని, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ , నేషనల్ కోఆపరేషన్ పాలసీలను కేంద్ర ప్రభుత్వంతక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర చట్టం రుణమాఫీ, విద్యుత్తు ప్రవేటికరణ దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కొత్త జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించు కొవాలని డిమాండ్ చేశారు. ధర్నా ఆనంతరం డిఆర్‌ఒకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, దస్తగిరి, శ్రీనివాసరెడ్డి, మహిళా సంఘం నాయకులు రజియా, సిఐటియు నాయకులు హుస్సేనయ్య, పిడిఎస్‌యుజిల్లా నాయకులు భాస్కర్, రమాదేవి, అబ్దుల్లా గౌడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పిల పెండింగ్ జీతాలివ్వాలి

- కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్‌పి ఉద్యోగులు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పట్టణపేదరిక నిర్మూలనసంస్థ (మెప్మా) కు చెందిన రిసోర్స్‌పర్సన్స్ (ఆర్‌పి)కు ఆరు నెలల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆ సంఘం నగరఅధ్యక్షులు పి.రుద్రమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎండి.అంజిబాబు, పి.నిర్మల ,ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి మాట్లాడారు. ఆర్‌పిల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఆరు నెలలుగా వేతనాలు అందక పని చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనికరించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఆర్‌పిలకు వార్షిక బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి టిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌పిలు పొదుపు గ్రూసులకు అవగాహన కల్పిస్తూ, బ్యాంకులనుంచి తీసుకున్న రుణాలను ఎలా ఖర్చు చేసుకోవాలి, తిరిగి బ్యాంకుకు ఎలా జయచేయాలని అవగాహన కల్పిస్తుంటారన్నారు. ఐక్యసంఘాలను నిరంతరం చైతన్య పరిచే ఆర్‌పిలు అర్ధాకలితో ఎలా బకులీడుస్తారని ప్రశ్నించారు. ఆర్‌పిలకు సిఒ,డిఇఒలుగా పదోన్నతులు కల్పించడమే కాకుండా కనీస వేతనం అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్‌పిల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు యూనియన్ నాయకుల బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యలన్నిటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని జెసి హామీ ఇచ్చారు. సిఐటియు నగర నాయకులు సిహెచ్.సాయి బాబా, వెంకటేశ్వర్లు ఆర్‌పిల సంఘం నాయకులు అరుణ, స్వాతి, మరియమ్మ ,సుజాత ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజిబాబు



నిరసన చేపడుతున్న నాయకులు

అమిత్‌షా రాజీనామా చేయాలి

- కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జిలానిబాష, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా వైఖరి పట్ల నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు, జిలానిబాష మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అన్ని దేశాలు గౌరవిస్తున్నాయన్నారు. మనదేశంలో బిజెపికి చెందిన కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే ఆయనను మంత్రివర్గం నుండి తొలగించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామోదరం రాధాకృష్ణ, అనంతరత్నం , లాజరస్, షేక్ జిలాని బాష, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- సుందరయ్య సర్కిల్‌లో సిఐటియు నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేసి కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ దగ్గర సుందరయ్య సర్కిల్‌లో సిఐటియు కర్నూలు న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ నిరసన తెలిపారు. అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని, కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు కర్నూలు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.డి. అంజిబాబు, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్. సాయిబాబా, సిఐటియు నగర నాయకులు టి. రాముడులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతరాజ్యాంగాన్ని రచించి దిశా,దశ, నిర్దేశాన్ని చూపిన మహనీయుడన్నారు. ప్రపంచ మేధావి, ప్రపంచంలో అత్యధిక డిగ్రీలు పొందిన విజ్ఞానవంతుడు ప్రపంచ దేశాలు బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కొనియాడుతున్నాయన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఉపయోగించుకొని ఎన్నికలలో గెలిచి అధికారం చేపట్టిన బిజెపి నాయకులు అజ్ఞానంతో బుద్ధిమందగించి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారని విమర్శించారు. పార్లమెంటు సాక్షిగా మత విద్వేషాలు రెచ్చగొడుతూ, ఐక్యంగా ఉన్న ప్రజలను బిజెపి విచ్ఛిన్నం చేయాలని చూస్తుందన్నారు. భారతపార్లమెంటు సాక్షిగా కేంద్రహోంమంత్రి అమిత్‌షా తన నోటికి వచ్చినట్లు అజ్ఞానంతో, అహంకారంతో భారత రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అంటే భారతదేశ ప్రజలను, భారత రాజ్యాంగాన్ని అవమానించినట్లేనన్నారు. రాజ్యాంగం ద్వారా పదవి పొందిన అమిత్‌షా రాజ్యాంగ ప్రమాణానికి భిన్నంగా వ్యవహరించి రాజ్యాంగాన్ని ఉల్లంఘించాడన్నారు. అమిత్‌షాను వెంటనే కేంద్ర ప్రభుత్వం బర్తరఫ్ చేసి, కఠినంగా శిక్షించి దేశ గౌరవాన్ని కాపాడాలిని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి హోంమంత్రిని వెంటనే బర్తరఫ్ చేసి కఠినంగా శిక్షించకపోతే రాబోయేరోజుల్లో కార్మిక వర్గాన్ని, ప్రజలను పెద్ద సంఖ్యలో సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి ఎన్ఎండి. రఫీ, విజయ్, ప్రసాద్, శ్రీను, అశోక్, చాంద్‌బాష,హుస్సేన్‌బాష, సిఐటియు నగర నాయకులు కె.సుధాకరప్ప, జి.ఏసు, కర్ణ, చిన్న మద్దిలేటి, శేఖర్, చెన్నయ్య, కృష్ణ,బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఎంఇఒను తక్షణమే తొలగించాలి

- జెసికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థిని కీర్తనపై దాడి చేసిన ఎమ్మిగనూరు మండల విద్యాశాఖ అధికారి-2 మధుసూదన్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను ఎస్ఎఫ్ఐ ప్రతినిధి బృందం , విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ,నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయిఉదయ్ సిటీ నాయకులు ఆర్యన్ ఉన్నారు. అబ్దుల్లా మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం పర్లపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కీర్తనను మండల విద్యాశాఖ అధికారి-2 మధుసూదన్ రాజు పాఠశాల పర్యవేక్షణకు వచ్చిన క్రమంలో కీర్తన మర్యాద ఇవ్వలేదనే కారణం చూపుతూ అసభ్యంగా మాట్లాడి దాడి చేయటం బాధాకరమన్నారు. విద్యాశాఖ అధికారి వృత్తికే మచ్చ అని, దాంతోపాటు ఆ విద్యార్థినిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆమెను అవమానించారన్నారు. గత సోమవారం.. డిప్యూటీ డిఇఒ వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేసి ఆరు రోజులవుతున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఎంఇఒపై విచారణలో వచ్చిన రిపోర్ట్ ఆధారంగా, విద్యాహక్కు చట్టం -2009 అధ్యయనం 4 సెక్షన్ 17 నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోలేదన్నారు. జెసి స్పందిస్తూ వెంటనే ఈ ఘటనపై విచారణ చేపట్టి ఎంఇపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాలికలను ప్రోత్సహించి చదివించండి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ప్రతి ఒక్కరూ బాలికలను చదివించాలని, బాలికలను రక్షించాలని డిఎంహెచ్ఒ కార్యాలయ డెమో శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఇందిరమ్మ హౌసెస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పెద్దపాడు గ్రామం దామోదరం సంజీవయ్య స్మారక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు (బేటి పడవో-బేటి బచావో) బాలికలను రక్షించండి- బాలికలను చదివించండి అనే కార్యక్రమంపై డెమో శ్రీనివాసులు అవగాహన కల్పించినారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు పుట్టడం అదృష్టంగా భావించాలని, మగపిల్లలతో సమానంగా పెంచాలన్నారు. కౌమార దశలోని ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం ద్వారా వారు గర్భం దాల్చడం తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యార్థినిలు పౌష్టికహారం తీసుకోకపోవడం వలన రక్తహీనతకు గురవుతారని, ఏకాగ్రత లోపించడం వలన చదువులో వెనుక బడిపోతారని తెలిపారు. ప్రతి గురువారం పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇచ్చే ఐరన్ ఫోలిక్ మాత్రలు భోజనం తరువాత మింగాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్ర శేఖర్ రెడ్డి, హెడ్ మాస్టర్ హరిత, టీచర్లు సుజాత, ఆరోగ్య విద్యబోధకురాలు పద్మావతి, ప్రోజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ఐదు రోజుల్లో వంద గొర్రెలు మృతి

ఆహారం విషతుల్యమా.. వింత రోగమా ..! -కదలిన పశువైద్యాధికారులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామంలో ఐదు రోజుల్లో వంద గొర్రెలు మృత్యువాత పడ్డాయి. తిమ్మందొడ్డి చుట్టుప్రక్కల సుమారు 30 గొర్రెల మందలు ఉన్నాయి. తిమ్మందొడ్డికి చెందిన దస్తగిరి, పెద్ద మాధవస్వామి, పీసు రాముడు, పగ్గం అనుమంతు, చిన్న గోరంట్లకు చెందిన 800 గొర్రెల మందకు మాత్రం ఏం మాయ రోగమో... లేక ఏ విషాహార తుల్యమో....ఐదు రోజుల్లో సుమారు 100 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కాపరులు మాత్రం ఈ నెల 18 న లివర్ ఆరోగ్యాంగా ఉండాలని, తిన్న ఆహారం జీర్ణం అవ్వాలని పిసిడాక్స్‌తో పాటు ట్రేపిడల్‌ను ఒక్కో గొర్రెకు 12 ఎంఎల్ చొప్పున వేసినట్లు తెలుపుతున్నారు. మరుసటి రోజున చూస్తే ఏకంగా 20న 35 గొర్రెలు, 21 న 15 గొర్రెలు ,22న 20 గొర్రెలు, 23న ఆరు గొర్రెలు ఐదు రోజుల్లో 100 గొర్రెలకు మృత్యువాత పడ్డాయి. నివారించేందుకు పశు వైద్యులు, జిల్లా పశు వైద్యాధికారులు సిబెళగల్ శాఖ ప్రవీణ్ కుమార్, పోలకల్ శాఖ రిచర్డ్, గూడూరు ఎడి శివప్రసాద్, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ కలిసి వైద్యం అందిస్తూనే ఉన్నారు. అయినను అదుపులోకి రాకపోవడంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కొన్ని మందులు వాడేటప్పుడు కొన్ని ప్రాంతాల్లో ఆహారం జీర్ణం కాక విషతుల్యం అవుతాయని , పంటలకు వేస్తున్న పిచికారీ మందుల ప్రభావం కూడా ఉండొచ్చని వైద్యులు చెప్పుకొచ్చారు.ఎట్టకేలకు చనిపోయిన గొర్రెలకు పోస్టు మార్టం నిర్వహించి, రక్త నమూనాలు ల్యాబ్ కు పంపిస్తున్నట్లు తెలిపారు. నష్టం అంచనాకు ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

మృతిచెందిన గొర్రెలు

పరిశీలిస్తున్న వైద్యులు

మేకల, గొర్రెల కాపరులను ప్రభుత్వమే ఆదుకోవాలి : మండలంలోనీ తిమ్మందొడ్డిలో విషాహారం వల్లనో, లేక వింత రోగం వల్లనో ఐదు రోజుల్లో 100 గొర్రెలు మృతి చెందాయని ప్రభుత్వం ఆ రైతులను ఆదుకోవాలని సొసైటీ సంఘ సభ్యులు వెంకట్రాముడు, ధనుంజయ, తిరుమలేష్‌లు డిమాండ్ చేశారు. మృత్యువాత పడ్డ గొర్రెల మందలను సోమవారం సొసైటీ చీఫ్ చైర్మన్ కెఎ.పాల్ పరిశీలించారు. ఆయన వెంట సభ్యులు చేరుకొని బాధిత రైతులతో మాట్లాడారు. ప్రధానంగా ప్రభుత్వ పశు వైద్య శాలల్లో ఉచిత మందుల కొరత తీవ్రత కారణంగా ప్రైవేట్ దుకాణాల్లో కాలం చెల్లినవి వేసి ఇలా నష్టాలను చూస్తున్నారని అన్నారు.తిమ్మందొడ్డి బాధితులకు సుమారు 100 గొర్రెలు మృతి చెందాయని, దాదాపు రూ.9 లక్షలు నష్టం మిగిల్చిందని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కులవివక్ష ఉన్న గ్రామాలను సందర్శించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అత్యాచారాలు, కులవివక్ష జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి కలెక్టర్, ఎస్‌పి సందర్శించి శాంతి భద్రతలను సమీక్షించాలని జీవోఎంఎస్ నెంబర్ 108 చెబుతున్నా.. అధికారుల చెవికి ఎక్కడం లేదని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు విమర్శించారు. ఈ మేరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అదనపు ఎస్‌పి ఉస్సేన్ పీరాలను కెవిపిఎస్, కెజిబివి, డివైఎఫ్ఐ, ఆర్‌విఎస్, ఆర్‌టిఐ సంఘాల ఆధ్వర్యంలో ఆదోని మండలం, జిహోసల్లి గ్రామంలో కొనసాగుతున్న వివక్షను గురించి అధికారులకు వివరించారు. వెంటనే ఆ ప్రాంతాన్ని జిల్లా స్థాయి అధికారులు సందర్శించాలన్నారు. అంటరానితనంపై ప్రశ్నించిన దగ్గర కూడా బాసటగా నిలబడకపోతే చట్టానికే అవమానమన్నారు. జాయింట్ కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సబ్ కలెక్టర్‌కు పోలీస్ ప్రొటక్షన్ ఇచ్చి వివక్ష లేకుండా సమాన అవకాశం కల్పించాలని ఆన్‌లైన్ ద్వారా ఆదేశించారు. జిల్లా ఎస్‌పి ఉసేన్ పీరా మాట్లాడుతూ ఇప్పటికే బాధిత వర్గంతో పాటు గ్రామస్తులను పిలిపించి డిఎస్‌పి మాట్లాడారని చెప్పారు. డిఎస్‌పి చెప్పినా దేవరకు వెళ్లేందుకు అవసరమైన డోళ్లు కొట్టకుండా మరో వివక్ష పాటిస్తున్నారని, పోలీసులే జోక్యం చేసుకుని డోళ్లు కొట్టేలా మాట్లాడటంతో పాటు, పోలీస్ రక్షణ కల్పించాలని నాయకులు తెలిపారు. అధికారులను కలిసిన వారిలో ఎండి. ఆనంద్ బాబు, ఆర్‌టిఐ యాక్టివిస్ట్ టి.లక్ష్మీనారాయణ, డివైఎఫ్ఐ, రజకవృత్తి దారుల సంఘం, కాటికాపరుల సంఘం, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు వై.నగేష్, సి.గురుశేఖర్, ఎన్‌జి కృష్ణ, ఎస్.అబ్దుల్లా, నాయకులు రాఘవేంద్ర, సాయి, అమర్ ఉన్నారు.

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎండి ఆనంద్‌బాబు, గురుశేఖర్

వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

రెవెన్యూ సదస్సు అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ సదస్సులో వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, కొండయ్య, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నా

చట్ట బద్ధమైన పాలన అందించాలి: రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం

ప్రజలకు చట్టబద్ధమైన పాలన అందించేందుకు అధికారులు కృషి చేయాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం పేర్కొన్నారు. కలెక్టరేట్ లో గుడ్ గవర్నెన్స్ వీక్ - గ్రామాల వైపు పరిపాలన (ప్రశాసన్ గావోం కి ఓర్) కి సంబంధించిన వర్క్‌షాప్‌లో బి.లక్ష్మీకాంతం ముఖ్య అతిథిగా పాల్గొని సుపరిపాలన అంశంపై ప్రసంగించారు.



వినతులు స్వీకరిస్తున్న అడిషనల్‌ఎస్‌పి హుస్సేన్‌పీరా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 93 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు కొత్తపేటలోని కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి.హుస్సేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో అడిషనల్ ఎస్‌పి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.


నిరసన చేపడుతున్న నాయకులు

హామీలను అమలు చేయాలి

- రైతుసంఘాల సమన్వయ కమిటీ

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం పేరుతో దొడ్డిదారిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం ఢిల్లీ సరిహద్దుల్లో పోరాడుతున్న రైతులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర చట్టాన్ని స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు అమలు చేయాలని, రైతు రుణమాఫీ చేయాలని కోరారు. మోటార్లకు మీటర్లు పెట్టరాదని, సహకార బ్యాంకు కేంద్ర మంత్రిత్వ శాఖను రద్దు చేసి రాష్ట్రాలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని ఆమరణ దీక్ష చేస్తున్న రైతు ప్రాణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, ఉపాధ్యక్షులు పి.హనుమంతు, జిల్లా నాయకులు లక్ష్మిరెడ్డి, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, అయ్యప్ప, గోపాల్, మండల నాయకులు హనుమంతరెడ్డి, రహీంబాషా పాల్గొన్నారు.

ఉచితంగా సభ్యత్వ నమోదు

- టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

టిడిపి ఉచిత సభ్యత్వ నమోదును మండలంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు, దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ తెలిపారు. సోమవారం దేశాయ్ నెట్‌వర్క్ కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలవడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యత్వం నమోదు చేసుకున్న వ్యక్తికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 31 వరకు నిర్వహిస్తామని తెలిపారు. మాజీ సర్పంచి రామన్న గౌడ్, కె.శివ, కాశీం, శివ, అజయ్, దేశాయ్ నెట్‌వర్క్ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేపడుతున్న గురురాజ్ దేశాయ్

ఇంటి నిర్మాణాల పూర్తికి ప్రోత్సాహం

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

మధ్యలోనే ఆగిపోయిన ఇంటి నిర్మాణాల లబ్ధిదారులతో కలిసి వారికి త్వరగా నిర్మాణ బిల్లులు మంజూరవుతాయని, ఎంత త్వరగా పూర్తి చేస్తారో అంత త్వరగా బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారిని ప్రోత్సహించాలని హౌసింగ్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ అల్లాబకాష్ సూచించారు. సోమవారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ప్రభుత్వం హౌసింగ్ సర్వే, ఇతర సర్వేలను కూడా పూర్తి చేసే బాధ్యత అధికారులపై పెట్టిందని తెలిపారు. విధుల్లో అలసత్వం వహించకుండా తీసుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాలకు వెళ్లి ఇంటి నిర్మాణ లబ్ధిదారులతో తప్పనిసరిగా మాట్లాడి నిర్మాణాలు పూర్తయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా నిర్మించుకునే వారి వివరాలు కూడా స్వీకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, సుధీర్, సురేంద్ర, నరసింహులు, ప్రమీల, హౌసింగ్ అధికారులు భవ్య, కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

సమావేశం నిర్వహిస్తున్న ఎంపిడిఒ అల్లా బకాష్

భవనాలు నిర్మించారు.. వదిలేశారు...

● తెరచుకోని హెల్త్ సెంటర్లు ● పునాదులకే పరిమితమైన ఆర్‌బికెలు ● లక్షలాది రూపాయలు వృథా

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజలకు సేవలందించాలని గత ప్రభుత్వ హయాంలో విలేజ్ హెల్త్ క్లినిక్, పాల కేంద్రం భవనాలను నిర్మించారు. మండలంలోని కైరుప్పల గ్రామ శివారులో నిర్మించిన రెండు భవనాలు పూర్తయి మూడేళ్ళు కావస్తున్నా పాలకులు, అధికారులు వినియోగంలోకి తీసుకురాలేదు. ఉపయోగంలో లేని ఈ భవనాల చుట్టూ ట్రాక్టర్ పనిముట్లు, పశువులకు నిలయంగా ఉంది. భవనాల ఆలనాపాలన చూడకపోవడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు సేవలు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆర్‌బికెలు పూర్తి చేసినా అత్తుతికంగా పునాదులు, పిల్లర్లు కూడా దాటని పరిస్థితి నెలకొంది. కొన్నింటికి నిధులు మంజూరు చేయడంలో అప్పటి ప్రభుత్వం చేతులెత్తేయడంతో చివరి దశలో ఎక్కడ ఉన్న నిర్మాణ పనులు అక్కడే నిలిచిపోయాయి. నేటికీ కొన్ని కేంద్రాల్లో ఎలాంటి కార్యక్రమాలూ నిర్వహించకుండా మూసిన తలుపులు మూసినట్లుగానే ఉంటున్నాయి. నిర్మాణ పనులు పూర్తికాని భవనాలు వదిలి కనీసం పూర్తయిన భవనాలైనా వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు. ఆస్పరి మండలానికి సుమారు 19 సచివాలయాలు మంజూరయ్యాయి. 12 పూర్తి కాగా 7 వివిధ స్థాయిలో ఉన్నాయి. విలేజ్ హెల్త్ సెంటర్లు 16 మంజూరు కాగా 6 పూర్తయ్యాయి. 10 పెండింగ్‌లో ఉన్నాయి. 4 పాల హెల్త్ కేంద్రాలు మంజూరు కాగా 2 పూర్తయ్యాయి. 2 బేస్‌మట్టం లెవెల్‌లో నిలిచిపోయాయి. 19 రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా 10 పూర్తయ్యాయి. 9 పునాదులకే పరిమితమయ్యాయి.

కైరుప్పలలో భవనాలు పూర్తయిన తెరుచుకోని కేంద్రాలు

పూర్తయిన భవనాలను వినియోగంలోకి తెస్తాం

- పిఆర్ ఎఇ వెంకటేశ్వర్లు

గ్రామాల్లో పూర్తయిన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. 85 శాతం పూర్తయిన భవనాల పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చి, నిధులు మంజూరు చేస్తే పునాదుల స్థాయి పెండింగ్ ఉన్న భవనాలను పూర్తి చేస్తాం.

టిప్పు సుల్తాన్‌కు సన్మానం

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్ట్ ఛైర్మన్ టిప్పు సుల్తాన్‌ను మండలంలోని టిడిపి కుంటనహాల్ గ్రామ నాయకులు సన్మానించారు. సోమవారం కర్ణి బసప్ప గౌడ్, దొడ్డనగౌడ్, చెంగిని హుస్సేన్ బాష, రౌడూరు అలీ సాబ్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిప్పు సుల్తాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు టిడిపికి మరింత అభిమానం పెరిగిందన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు పోరాడే కుటుంబానికి ఈ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తుంగభద్ర దిగువ కాలువ కింద ప్రతి రైతుకూ సాగునీరు అందేలా కృషి చేయాలని కోరారు.

టిప్పు సుల్తాన్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు హైకోర్టు న్యాయమూర్తి శ్రీశానంద కుటుంబ సభ్యులతోను, బెంగళూరు నగరం మల్లేశ్వర ప్రాంతానికి చెందిన డాక్టర్ మహర్షి గురురాజ్ సతీసమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అధికారులు స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. వారికి పోలీసు శాఖ నుంచి తగిన భద్రత కల్పించారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

- తహశీల్దార్ శ్రీనాథ్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనాథ్ తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూముల రీసర్వే, ఆన్‌లైన్, పట్టాదారు పేరు మార్పు తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్ ఆళప్ప పాల్గొన్నారు.

రైతు భూసమస్యలు పరిష్కరించాలి

రైతుల భూసమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు హనుమంతు డిమాండ్ చేశారు. మండలంలోని చిన్న తుంబలం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి సాగు చేసుకుంటున్న ప్రతి రైతుకూ పట్టాలు మంజూరు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామంలో భూరీసర్వే వెంటనే చేపట్టాలన్నారు. వంక పొరంబోకులో సాగు చేసుకున్న రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఓంగరగ్, బాపురం గ్రామాల్లో రైతుల భూసమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మెడికల్ కళాశాలపై స్పష్టత ఇవ్వాలి

- ఎమ్మెల్యేను నిలదీసిన విద్యార్థి సంఘాల జెఎసి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో మెడికల్ కళాశాలపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థి సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఆదోని మెడికల్ కళాశాల అర్ధాంతరంగా నిలిచిపోవడాన్ని నిరసిస్తూ విద్యార్థి జెఎసి నాయకులు నిరసన చేపట్టారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే పార్థసారథి క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించారు. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సబీర్ బాష, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, బిఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, బిడిఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ మాట్లాడారు. అభివృద్ధిలో వెనుకబడిన ఈ ప్రాంతం ప్రగతి పథంలో నడవాలంటే పరిశ్రమలు, విద్యాసంస్థలు నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మెడికల్ కళాశాల నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే పార్థసారథిని నిలదీశారు. పనులు ఆగిపోవడంతో.. ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఆ ప్రభావం ఆదోని ప్రభుత్వాస్పత్రిపై చూపిందన్నారు. వైద్యులు, ఉద్యోగులు రిలీవై వెళ్తున్నారని, ఆస్పత్రి పరిస్థితి మొదటకే వస్తుందని తెలిపారు. డాక్టర్లు, ఉద్యోగులు ఇక్కడ ఉండేలా శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... మెడికల్ కళాశాల పట్ల విద్యార్థి జెఎసి నాయకుల స్పందన అభినందనీయమన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ గళమెత్తాల్సిన అవసరం ఉందని తెలిపారు. అసెంబ్లీలో మాట్లాడతానని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించిన నాయకులు

'రోడ్ల మరమ్మతులు చేపట్టాలి'

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్ల వైపు పాలకుల దృష్టి పెట్టాలని, వెంటనే మరమ్మతులు చర్యలు చేపట్టాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రోడ్ల అధ్వాన పరిస్థితిపై ఎంపిడిఒ గౌరీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పి.కోటకొండ బస్ స్టేజి నుంచి బేతపల్లి, కప్పట్రాళ్ల నుంచి బండగట్టు వరకు, పుల్లాపురం నుంచి తెర్నేకల్, కరివేముల నుంచి జిల్లేడుబుడకల వరకు రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోడ్ల మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వెలమకూరు దగ్గర వరకు బిటి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. డివైఎఫ్ఐ నాయకులు మహేష్, గిరిబాబు, శివశంకర్, ప్రకాష్ పాల్గొన్నారు.

'మైనార్టీ కాలనీని సందర్శించాలి'

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారులో ఉన్న మైనార్టీ కాలనీని సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు అజీమ్ ఖాన్, ఇక్బాల్, సీనియర్ నాయకులు హుస్సేన్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాలనీ ఏర్పడి సుమారు మూడు దశాబ్దాలు అయిందన్నారు. అందులో మైనార్టీ కుటుంబాలు వందకు పైగా నివసిస్తున్నాయని తెలిపారు. అక్కడ సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో చిన్నపాటి వర్షమొచ్చినా ఇళ్ల మధ్యలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని, సందర్శించి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

జిల్లా జట్టుకు ఆదోని విద్యార్థులు

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా జట్టుకు జరిగిన ఎంపిక పోటీల్లో ఆదోనికి చెందిన ఇద్దరు విద్యార్థులకు చోటు దక్కిందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ అమర్ ప్రకాష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ... ఆదివారం కర్నూలులోని జిల్లా అవుట్‌డోర్ స్టేడియంలో కబడ్డీ జిల్లాస్థాయి జట్టు కోసం ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. బాలురు 60 మంది, బాలికలు 30 మంది వచ్చారన్నారు. అందులో ఆదోనికి చెందిన ఫిలిప్స్ కబడ్డీ జట్టు, అరుణ్‌జ్యోతి నగర్ క్రీడాకారుడు యు.నరసింహ, బాలికల విభాగంలో శ్రీరామ్ నగర్‌కు చెందిన బి.హారతి ఎంపికైనట్లు తెలిపారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని హాల్వి గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఈనెల 26, 27, 28న ప్రజలకు సేవలు అందించడానికి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరేళ్లలోపు ఉన్న పిల్లలు, విద్యార్థులు, ఇతరులు ఆధార్ అప్‌డేట్‌ను చేసుకోవాలని కోరారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని సెయింట్ ఆంథోనియో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం సపోజ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జాన్ డేవిడ్ మాట్లాడారు. శత్రువును సైతం ప్రేమించాలన్నదే క్రీస్తు మార్గమని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సహనం, ఓర్పు అలవర్చుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు సిస్టర్ రేణుక, పూర్వపు విద్యార్థి డాక్టర్ అంజనప్ప, ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్రీమఠంలో హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో చేపట్టిన హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేశారని తెలిపారు. ఈ ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కించినట్లు చెప్పారు. ఈనెలలో 25 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.3,56,04,597, బంగారం 64 గ్రాములు, వెండి 1900 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

అమిత్ షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఆలూరు

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆలూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ చిప్పగిరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో కాంగ్రెస్, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, ఎంఆర్‌పిఎస్ డివిజన్ అధ్యక్షులు గూళ్యం ఎల్లప్ప మాట్లాడారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. తక్షణమే అమిత్ షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. అనంతరం ఆలూరు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, చిప్పగిరి మండల అధ్యక్షులు దేగులపాడు మంజునాథ్, కరెంటు గోవిందు, మల్లికార్జున, రామాంజనేయులు, మీసాల గోవిందు, వీరాంజనేయులు, ఎంఆర్‌పిఎస్ ఉపాధ్యక్షులు హొళగుంద వెంకటేష్, శాసం రామాంజనేయులు, ఎల్లార్తి మహేష్, గజ్జెహల్లి తాయన్న, కోగిలతోట వీరేష్, బాపురం మోషే, విరుపాపురం బసవరాజు, మార్లమడికి రంగన్న, హులేబీడు రామలింగ, వినిత్ పాల్గొన్నారు.

ఆలూరులో నిరసన చేపడుతున్న నాయకులు

కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్ప

ఆదోని : పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, కాటికాపరులు, గుంతలుతీసే బేగరుల సంఘం పట్టణ కార్యదర్శి యువరాజు డిమాండ్ చేశారు. అమిత్ షాను బర్తరఫ్ చేసి సభ్యత్వం రద్దు చేయాలని సోమవారం పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక చంద్ర ఘాట్ దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంబేద్కర్ పేరు వ్యాప్తిని కూడా సహించలేని స్థితిలో బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. ఈ వ్యాఖ్యల వల్ల అంబేద్కర్ పట్ల అమిత్ షాకు, బిజెపికి ఉండే వైఖరి స్పష్టమవుతోందన్నారు. ఈరన్న, నాగేంద్ర, కృష్ణ, నాగరాజు, హుస్సేని, అర్జున్ ఉన్నారు.

ఆదోనిలో నిరసన తెలియజేస్తున్న నాయకులు

NOTICE

ఇందుమూలముగా యావన్మంది ప్రజానికానికి తెలియచేయునది ఏమనగా నా క్లయింట్ అయిన ఎ.ప్రభాకర్ రెడ్డి తండ్రి అంబాల హుశేన్ రెడ్డి R/o Permanent Address H.No:2-84, పలుకూరు గ్రామం, బనగానపల్లె మండలం, కర్నూలు జిల్లా. Present Address. H.No:46/1-b-n-1-301, Chanakyapuri colony, Kurnool అనువారు దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థికి చెందిన ఒరిజినల్ లింక్ దస్తావేజు నెం: 923/1993 తేది 26.05.1993ను వారు ఇంటి వద్ద నుండి కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్లుచుండగా మార్గం మధ్యలో పోగొట్టుకొనియున్నాడు. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల దిగువ తెలిపిన అడ్రసులోగాని (లేదా) నా క్లయింట్ అడ్రసులో గాని తెలియపర్చగలరు. అట్లు గాక సదరు దస్తావేజు ఎవరైన దుర్వినియోగపర్చిన యెడల నా క్లయింట్ తీసుకొనబోవు చట్ట పరమైన చర్యలకు బాధ్యులగుదురు.

షెడ్యూలు: కర్నూలు జిల్లా నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, బేతంచెర్ల సబ్ డి॥ పలుకూరు గ్రామ సర్వే నెం: 232/1 య.4.80 సెంట్ల పైకి తూర్పు దిశకు య. 2.38 సెంట్లు గల భూమికి చెక్కుబంది.

చెక్కుబంది: తూర్పు: ఈ దినం నీవు ఎ.హుశేన్ రెడ్డి గారి నుండి దానముగా పొందిన భూమి, **పడమర:** అంబాల హుశేన్ రెడ్డి తాలుకు భూమి, **ఉత్తరం:** గౌర యేసయ్య భూమి, **దక్షిణం:** అంబాల హుశేన్ రెడ్డి తాలుకు భూమి.

G.S.Vijaya Bhaskar Reddy,
B.A.,B.L., Advocate
Address : H.No.87-1077, Ganesh Nagar, Nandyal Road, Near Partha Sarathi Towers, Kurnool.
Cell: 9347928866, 9985474567.

'కల్వర్టు నిర్మాణం చేపట్టాలి'

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ చిన్నచెరువు వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టాలని జనసేన పార్టీ నాయకులు ఎ.ఉచ్చీరప్ప, రామాంజనేయులు, గోవిందు, నరేష్ కోరారు. సోమవారం ఎంపిడిఒ గౌరీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవనకొండ నుంచి చెరువు కట్ట రహదారి మీద తలమారి, గుండ్లకొండ, పల్లెదొడ్డి, ఓబులాపురం, జిల్లెడు బుడకల, దాదాపు 12 గ్రామాలకు, పొలాలకు వెళ్లే వారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. చెరువు పైనుంచి నీరు రోడ్డుపై పారడంతో రోడ్డు పాచి పట్టిందని, రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ సమస్యపై ఇంజినీర్‌తో చర్చించి శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఎంపిడిఒ హామీ ఇచ్చారు.

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కౌతాళం

గణిత శాస్త్రంలో అపర మేధావిగా పేరుగాంచిన శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత శాస్త్ర దినోత్సవాన్ని సోమవారం స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత శాస్త్రం గురించి గణిత శాస్త్ర ఉపాధ్యాయులు జయలక్ష్మి మాట్లాడారు. విద్యార్థులు మనం చేసే ప్రతి పని సమయాన్ని లెక్క కట్టుకుంటూ పోతే అది ఒక మ్యాథమేటిక్స్, ఆలోచిస్తే ప్రతి విషయంలోనూ గణితం ఇమిడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గణితం గురించి భయాందోళనకు గురి కాకూడదని చెప్పారు. విద్యార్థులు తరగతిలో శ్రద్ధగా విని ఒకసారి సాధన చేస్తే గణితమంతా సులువేదీ ఉండదని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన గణిత ప్రాజెక్టులను తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. తర్వాత పదో తరగతి విద్యార్థులు గణిత శాస్త్ర ఉపాధ్యాయులు జయలక్ష్మిని సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, సెక్రటరీ మైనుద్దీన్ పాల్గొన్నారు. **మంత్రాలయంలో** శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవం నిర్వహించారు. స్థానిక శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీపరిమళ విద్యానికేతన్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎఒ ఈరన్న, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వనశ్రీ, నాగలక్ష్మి, రాఘవేంద్ర, పిఇటి వెంకటేష్ పాల్గొన్నారు. **ఆస్పరి**లోని నారాయణ ప్రైమ్ స్కూల్‌లో కరస్పాండెంట్ నరేష్ ఆచారి ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారులకు వ్యాసరచన, సెమినార్లు, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధానోపాధ్యా యులు హరిప్రసాద్, అకాడమిక్ డీన్ షేక్ నిజం పాల్గొన్నారు.

కౌతాళంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది


ఆస్పరిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నరేష్ ఆచారి



మంత్రాలయంలో

పాఠశాల కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించాలి

- ఎంపిటిసి మల్లికార్జున

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ఇంగలదహాల్ పాఠశాల కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించాలని ఎంపిటిసి మల్లికార్జున, సర్పంచులు ఇంగలదహాల్ ప్రమీదవతమ్మ, ఎమ్‌డి.హళ్లి సుధాకర్, పెద్దగోనేహాల్ వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి, సర్పంచి చంద్రన్న, గ్రామ పెద్దలు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంగలదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 1964వ సంవత్సరంలో ఏర్పాటు చేశారని, పాఠశాల ఏర్పాటు చేసినప్పుడే పాఠశాలకు కాంప్లెక్స్‌ను ఇచ్చారని తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం స్కూల్ కాంప్లెక్స్ రీ ఆర్గనైజింగ్ పేరుతో కాంప్లెక్స్‌ను తొలగించారని, తొలగించడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలకు సువిశాలమైన 7.65 ఎకరాల స్థలం ఉందని, రోడ్డు రవాణా సౌకర్యం, బాలుర వసతి గృహం, పాఠశాలలో అదనపు తరగతి గదులు అన్ని వసతులూ ఉన్నాయని తెలిపారు. ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా పాఠశాల కాంప్లెక్స్‌ను తొలగించడం దారుణమని మండిపడ్డారు. కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరారు. గ్రామ పెద్దలు శ్రీకాంత్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, యూత్ అసోసియేషన్ సభ్యులు రఫీ, రాజు, శేఖర్, మల్లికార్జున, బాబు, పంపాపతి పాల్గొన్నారు. అలాగే ఎల్లార్తికి కేటాయించిన పాఠశాల కాంప్లెక్స్‌ను యథావిధిగా ఉంచాలని ఎంఇఒ సత్యనారాయణకు యువనేత ఎస్‌కె.గిరి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... ఎల్లార్తి గ్రామంలో అన్ని రకాల వసతులు, ఉపాధ్యాయులు రావడానికి రోడ్డు రవాణా సౌకర్యం ఉందని తెలిపారు. కాంప్లెక్స్ ఉంటే పాఠశాల అభివృద్ధి అవుతుందని, కేటాయించిన స్కూల్ కాంప్లెక్స్‌ను కొనసాగించాలని కోరారు. రాజా, జిలాన్, గాదిలింగ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.660/2022

గొల్ల నాగవేణి. ...వాది

-వర్సెస్-

1.పి.మొహమ్మద్‌ఖాన్
2.ది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
ఎ.పి.యస్.పి.డి.సి.యల్, బి.రోడ్ సెక్షన్, కర్నూలు
...ప్రతివాదులు

1,2 ప్రతివాదులకు దావా సమన్లు

1.పి.మొహమ్మద్‌ఖాన్ తండ్రి పి.రహమాన్‌ఖాన్, ఇంటి.నెం.45/142-31/1,వెంకటరమణ కాలనీ, కర్నూలు.
2.ది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎ.పి.యస్.పి.డి.సి.యల్, బి.రోడ్ సెక్షన్, కర్నూలు.

పైనెంబరు దావాలో వాది, ప్రతివాదులు అయిన మీ మీద దావా కనబరచిన షెడ్యూలు ప్లాటు.నెం.4ను జి.సాయిబాబు అలియాస్ గొల్ల సాయిబాబ యాదవ్ దగ్గర నుండి 8/8/2016లో కొనుగోలు చేశారు అప్పటి నుండి ఇప్పటి వరకు వాది అధీనం మరియు అనుభవంలో ఉంది. ఈ ప్లాటును వాదికి అనుకూలంగా తీర్పు ఇవ్వాలని అలాగే తుది తీర్పు వచ్చే వరకు ప్రతివాదులు కాని వారికి సంబంధించిన ఎజెంట్స్‌కాని వెల్లకుండా ఇన్‌టరీం ఇంజంక్షన్ ఇవ్వమని దావా దాఖలు చేసినారు. ఇందులో 1,2, ప్రతివాదులైన మీకు కోర్టు నుండి పలుమార్లు సమన్లు పంపినను మీకు చేరనందున కోర్టువారు ఈ పత్రిక ద్వారా సమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 1,2 ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 10-1-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 10-1-2025

బి.క్రిష్ణమూర్తి,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.